క్లుప్తంగా

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే కనకదుర్గమ్మ అమ్మవారికి లక్షమల్లెలతో అర్చన జరిపారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకారంలో గాయత్రీదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని శ్రీ గాయత్రీ దేవి ఆలయంలో శుక్రవారం గాయత్రీదేవి, యోగి వేమన విగ్రహాలకు విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున గాయత్రీదేవి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చనల నిర్వహించి క్యారెట్, టమాటా, వంకాయ, బీరకాయ, పైనాపిల్, చీనీ, జామ, ఆపిల్ పండ్లు, నిమ్మకాయలు తదితర కూరగాయలతో శాకంబరిదేవిగా అలంకరించారు. ఆలయ పూజారి 108 సార్లు గాయత్రీ మహా మంత్రాన్ని పఠించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

కాశినాయన : మండలంలోని నరసాపురం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు పోరుమామిళ్ల ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్, ఆప్కాస్ స్టేట్ బోర్డు మాజీ మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి 60 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులను శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచి కష్టపడి బాగా చదివి మంచి ప్రయోజకులు కావాలని తెలిపారు. అనంతరం డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మామిడి, ఉసిరి, కానుక మొక్కలను నాటారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ రామారావు, ప్రధానోపాధ్యాయుడు బాలయ్య, ఉపాధ్యాయులు ప్రసాద్, హనుమేష్, సుబ్రహ్మణ్యం, శ్రీధర్, ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

కలసపాడు : మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలలకు శుక్రవారం చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు, ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థామస్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధి ఎల్.ప్రసాద్ రెడ్డి నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. శుక్రవారం మండలంలోని శంఖవరం, ముద్దంవారిపల్లె, పిడుగుపల్లె, లింగారెడ్డిపల్లె, బలిజపల్లె, అక్కిసిద్ధుపల్లె, హృదయపేట, కరణంవారిపల్లె, మహానందిపల్లె, కలసపాడు మెయిన్, కలసపాడు ఉర్దూ, తెల్లపాడు, కొండపేట, పుల్లారెడ్డిపల్లె, రాజుపాళెం, ముల్లువారిపల్లె, బ్రాహ్మణపల్లె ఎంపీపీ పాఠశాలల్లో చదువుతున్న 542 మంది విద్యార్థులకు 1716 పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

14న వాహనాల వేలం

మైదుకూరు : ఎక్సైజ్ నేరాలలో పట్టుకున్న వాహనాలను ఈనెల 14వ తేదీన వేలం వేయనున్నట్టు మైదుకూరు ఎక్సైజ్ సీఐ ఎస్.ధీరజ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు నేరాలలో పట్టుబడిన రెండు మోటార్ బైక్‌లు, ఒక కారును స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు సీఐ వివరించారు. వాహనాలను కొనుగోలు చేయాలనుకున్న వారు వేలంలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

అల్లాడుపల్లె రైతు సహకార సంఘం చైర్మన్‌గా నరసింహారెడ్డి

చాపాడు : అల్లాడుపల్లె రైతు సహకార సంఘం చైర్మన్‌గా మార్తల నరసింహారెడ్డి నియమితులయ్యారు. గత ఏడాదిగా ఖాళీగా ఉన్న పాలక మండలి స్థానాలకు ప్రభుత్వం త్రీ మ్యాన్ కమిటీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో చైర్మన్‌గా సీతారామాపురం గ్రామానికి చెందిన మార్తల నరసింహారెడ్డి, కమిటీ సభ్యులుగా నెర్రవాడకు చెందిన మేకల సుదర్శన్ యాదవ్, అనంతపురం గ్రామానికి చెందిన ఎన్.మల్లికార్జునరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు వీరి వివరాలను జిల్లా ఉన్నతాధికారులు పంపాలని చాపాడులో అల్లాడుపల్లె రైతు సహకార సంఘం బ్యాంకుకు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకూ త్వరలో వీరు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

16న వైస్ ఎంపీపీ ఎన్నిక

చాపాడు : ఈనెల 16న మండల పరిషత్ రెండో వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి వీరకిషోర్ తెలిపారు. మే 22 పల్లవోలు ఎంపీటీసీ, రెండో ఉప మండలాధ్యక్షురాలు నగర్తి సుందరమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఖాళీ అయిన ఉప ఎంపీపీ స్థానానికి ఈనెల 16న ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈ క్రమంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ప్రత్యేక సమావేశంలో ఎంపీటీసీలు రెండో ఉప ఎంపీపీని ఎన్నుకోనున్నారని ఎంపీడీఓ చెప్పారు.

కాడెద్దులు కనుమరుగు

- ట్రాక్టర్లు, హార్వెస్టర్లతో వ్యవసాయ పనులు
- ఖర్చు తక్కువ.. సమయం ఆదా
- ఆదరణ కోల్పోతున్న ఎండ్ల బండ్లు



ఎద్దులతో దుక్కి దున్నుతున్న రైతు

కాశినాయన : పొలం దున్నాలన్నా.. విత్తు విత్తాలన్నా.. పండించిన పంట ఇంటికి చేరాలన్నా కాడెద్దులు కావాల్సిందే. వ్యవసాయంలో వాటి పాత్ర చాలా కీలకం. అయితే ఇదంతా గతం. ఇప్పు వాటి స్థానంలో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఎద్దులతో ఒక రోజు చేసే పని యంత్రాలతో రెండు మూడు గంటల్లో జరిగిపోతుంది. దీంతో విత్తనం మొదలు పంట కోత వరకు యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. ఇది కొంత ఖర్చుతో కూడుకున్నది. అయినా సమయం ఆదా అవుతుండటంతో అధిక శాతం మంది రైతులు యంత్రాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా ఒకప్పుడు రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచిన ఎద్దులు నేడు క్రమంగా కనుమరగవుతున్నాయి.

వ్యవసాయంలో ఎద్దులతో రైతులకు విడదీయరాని బంధం ఉంది. దీంతో ఇది వరకు గ్రామాల్లో రెండు మూడు ఎకరాలు ఉన్న ప్రతి రైతుకు కనీసం ఒక జత ఎద్దులు ఉండేవి. ఎద్దులు లేని రైతులు అద్దెకు పిలిపించుకుని పొలాలను తయారు చేసుకునేవారు. రానురాను దుక్కి దున్నడం నుంచి పంట కోసం ఇంటికి చేర్చే వరకు ప్రతి పని యంత్రాలతో జరిగిపోతుండటంతో కాడెద్దులపై రైతులు మొగ్గు చూపడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో జత ఎద్దులను కొనాలంటే రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు ధర పలుకుతున్నాయి. అంత పెట్టుబడి పెట్టి కాడెద్దులను తీసుకొచ్చి వాటిని పోషించడం తలకు మించిన భారమవుతోంది.

భారమవుతున్న పశు పోషణ

కాడెద్దులను పోషించడం రైతులకు భారంగా మారింది. ట్రాక్టర్ ఎండు గడ్డి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ధర పలుకుతోంది. ఇక దాణ, పచ్చిగడ్డి, సంరక్షణ ప్రతీది రైతుకు భారమవుతోంది. దీంతో రైతులు ఉన్న ఎద్దులను అమ్మేసి యంత్రాల వైపు మొగ్గుచూపుతున్నారు. గతంలో గ్రామానికి 15 -20 కాండ్ల ఎద్దులు ఉండేవి. కాశినాయన, కలసపాడు, బి.కోడూరు, పోరుమామిళ్ల మండలాల్లో గతంలో 500 కాండ్లకుపైగా ఎద్దులు ఉండేవని పెద్దలు చెబుతున్నారు. పశు పోషణ భారం అవుతోందని, యంత్రాలతో త్వరగా పని అవుతుందని రైతులు అంటున్నారు.

యాంత్రీకరణ దిశగా వ్యవసాయం

నూతన యాంత్రీకరణ దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. వ్యవసాయంలో ప్రతి పనికి యంత్రాలు రావడంతో వ్యవసాయం సులభతరంగా మారింది. దుక్కి దున్నడం మొదలు దమ్ము చేసి వరి నాట్లు వేసే వరకు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. దీంతో పాటు పండిన పంటను కోత కోసి ఇంటికి చేర్చే వరకు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి.

రేపటి నుంచి హుసేన్ పీర్ దర్గా ఉరుసు



హుసేన్‌పీర్ స్వామి దర్గా

బద్వేలు అర్బన్ : బద్వేలులోని దర్గావీధిలో వెలసిన శ్రీ హజరత్ హుసేన్ పీర్ ఔలియా స్వాముల వారి 200వ ఉరుసు మహోత్సవాలు ఆది, సోమవారాలలో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. హుసేన్ పీర్ స్వామివారి ఉరుసు ఉత్సవాలు ఈ ప్రాంతంలో ప్రసిద్ధి గాంచాయి. ప్రతి ఏటా మొహర్రం నెలలో క్రమం తప్పక గత 200 సంవత్సరాలుగా ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బద్వేలులో ఉరుసు ఉత్సవాలు ముగిసిన తర్వాత అదే నెలలో పోరుమామిళ్ల పట్టణంలో కూడా స్వామి వారి ఉరుసు నిర్వహిస్తారు. బద్వేలులో స్వామి ఐదవ తరం వారసుల ఆధ్వర్యంలో ఆదివారం గంధం, సోమవారం ఉరుసును వైభవంగా జరుపనున్నారు. ఈ ఉత్సవాల్లో కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన హిందూ, మహమ్మదీయ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహిస్తారు. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ గాయకులచే ఖవ్వాలి నిర్వహిస్తారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : పట్టణంలో శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ఎస్‌పీడీసీఎల్ డీఈఈ ఎంఆర్ శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఉప కేంద్రాలలో, విద్యుత్ లైన్లలో, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దువ్వూరు : మండలంలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కానగూడూరు, జిల్లెల్ల, చిన్నసింగనపల్లె సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బ్రహ్మంగారిమఠం : మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని బి.మఠం ఏఈ తెలిపారు. మల్లేపల్లె, డి.అగ్రహారం, చౌదరవారిపల్లె, సబ్‌స్టేషన్ల పరిధిలో రైతులు, వినియోగదారులు సహకరించాలన్నారు.

గోపవరం : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుళ్లాయప్ప తెలిపారు. 132 కె.వి. సబ్‌స్టేషన్ పరిధిలో ఉంటే బద్వేలు, గోపవరం, అట్లూరు, బి.మఠం మండలాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

14న వాహనాల వేలం

ప్రొద్దుటూరు క్రైం : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 14న జమ్మలమడుగు రోడ్డులోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 11.30 గంటలకు వేలం వేయనున్నట్లు ప్రొద్దుటూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీవీ సురేంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు నిర్దేశిత రుసుమును చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సీఐ కోరారు. ఇతర వివరాల కోసం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

వైద్య సిబ్బందికి సన్మానం

బ్రహ్మంగారిమఠం : బి.మఠం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన సీనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, స్టాఫ్‌నర్సు జీవమ్మ, ఏఎన్‌ఎంలు నరసమ్మ, ప్రసన్న, శారద, విజయరాణీలను స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సన్మానించారు. బద్వేల్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ సంపత్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రైతులను ఆదుకుంటాం



పొగాకు నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

బి.కోడూరు : మండలంలోని పొగాకు రైతులను ఎంతో కొంత లబ్ధి చేకూరేలా ఆదుకుంటామని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మున్నెల్లి గ్రామంలో పొగాకు సాగు చేసిన రైతులను ఆయన పరామర్శించారు. ఈ ఏడాది పొగాకు సాగుచేసిన రైతుల పొగాకును కంపెనీదారులు కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ మేరకు పలు మార్లు జిల్లా అధికారులకు, డివిజన్ అధికారులకు తెలుపగా ఎట్టకేలకు స్పందించిన అధికారులు శుక్రవారం నిల్వ ఉన్న పొగాకు కేంద్రాలను పంపిణీదారులతో కలిసి పరిశీలించారు. ఆర్డీఓకు రైతులు తమ గోడును వినిపించుకోగా స్పందించిన ఆయన ఫోన్‌లో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి కంపెనీదారులతో మాట్లాడించి ఎంతో కొంత రైతులకు న్యాయం చేకూర్చేలా చూడాలని కంపెనీ వారిని ఆదేశించారు. అనంతరం గోవిందాయపల్లె గ్రామానికి చెందిన సుమారు 16 ఎకరాల భూమిని కొంత మంది ప్రైవేటు వ్యక్తులు ఆన్‌లైన్ చేసుకున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా ఆ పొలం వద్దకు వెళ్లి పరిశీలించి అందుకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలకు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా మండల తహసీల్దారు దస్తగిరయ్యను ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ కొండారెడ్డి, సర్వేయర్ రక్షిత, రెవెన్యూ సిబ్బంది, మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఐత్రంపేట, మున్నెల్లి సర్పంచ్‌లు గురయ్య, పవన్, వ్యవసాయశాఖ ఏడీఏ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి రవికుమార్

పోరుమామిళ్ల : ఆటో కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, మండల కేంద్రాల్లో ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్, సీపీఐ మండల కార్యదర్శి రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం రంగసముద్రం పార్కులో జరిగిన ఆటో కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ ఆటో కార్మికునికి రూ. 10 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఆగస్టు 15కు ఇవ్వాలని, మళ్లీ వాయిదా వేయరాదన్నారు. బద్వేలులో ఉన్న ఆర్‌టీఓ కార్యాలయాన్ని కడపకు తరలించే ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. జీఓ 21 రద్దు చేయాలని, పెంచిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలు తగ్గించి నియంత్రించాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న రోడ్ల గుంతలు పూడ్చి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు. ఆటో కార్మికులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సఫా, పేరయ్య, కేశవ, ఆటో యూనియన్ నాయకులు అబ్దుల్ ఖాదర్, చంద్ర, ఈశ్వరయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై నివేదిక ఇవ్వండి

మైదుకూరు : మైదుకూరులోని ఆలయ భూముల (ఆలయ సేవల ఇనాం భూములు) అక్రమ రిజిస్ట్రేషన్లపై సమగ్ర నివేదిక ఇవ్వాలని స్టాంప్‌లు రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కడప జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.

మైదుకూరులోని సర్వే నంబర్లు 1845/1, 1845/2 , 1845/3ఏ, 1845/3బీ, 1845/3సీ, 1845/4లోని 10.20 ఎకరాల భూములను ఆర్‌ఎస్‌ఆర్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని మైదుకూరుకు చెందిన మాజీ సర్పంచ్ చొక్కం వెంకటరమేష్ స్టాంప్‌ల రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ భూములపై 2010-2022 మధ్య కాలంలో 130 రిజిస్ట్రేషన్లు జరిగాయని ఆయన ఫిర్యాదులో తెలిపారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ ఫిర్యాదుపై స్పందించిన స్టాంప్‌లు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ రెండు వారాల్లో సమగ్ర నివేదిక పంపాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.

మెరుగైన విద్యుత్ అందిస్తాం



పగడాలపల్లె వద్ద విద్యుత్ లైన్ పరిశీలిస్తున్న ఈఈ భరణి కృష్ణ

కాశినాయన : రైతులకు, ప్రజలకు మెరుగైన విద్యుత్‌ను అందిస్తామని ఏపీఎస్‌పీడీఎల్ మైదుకూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణి కృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని వరికుంట్ల, బాలయపల్లె, పగడాలపల్లె, కేఎన్ కొట్టాలలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలసపాడు 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఈ సబ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. అయితే విద్యుత్ లైన్ల వెంబడి చెట్ల కొమ్మలు, అరటి తోటల్లోని రెమ్మలను తొలగించడం జరిగిందన్నారు. బలమైన గాలులు వీచినప్పుడు సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. దాదాపు 30 కిలోమీటర్ల వరకు లైన్ వెంబడి ఉన్న చెట్లను తొలగించామన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవిచంద్రశేఖర్, శ్రీకాంత్, కుళ్లాయప్పతోపాటు అసిస్టెంటు ఇంజనీర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

జనాభా సమస్యలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత

ప్రొద్దుటూరు క్రైం : ప్రపంచంలో పెరుగుతున్న జనాభా సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా లైట్‌పాళెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, తల్లి ఆరోగ్యం, మానవ హక్కులు తదితర సమస్యలపై ప్రజలకు అవగాహన పెంచడమే జనాభా దినోత్సవ లక్ష్యమని తెలిపారు. జనాభా పెరుగుదల వల్ల కలిగే ఆర్థిక, వనరుల నష్టాల గురించి వివరించారు. ఆడపిల్లలకు సరైన వయసు వచ్చినప్పుడు మాత్రమే పెళ్లి చేయాలన్నారు. చిన్న వయసులో వివాహం చేయడం నేరమని తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మౌనిక, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, శోభారాణి, సూపర్ వైజర్ జయమ్మ, సీఓలు సుబ్బారెడ్డి, శ్రీదేవి, నాగజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

సిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో..

సిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో వైఎంఆర్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి నల్లబల్లి హిమబిందు ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రణాళికా బద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణ మధ్య ఆరోగ్యకరమైన సమయం , అంతరం అనే నినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ వల్లంకొండు అనూష మాట్లాడుతూ ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు కలిగి ఉండాలన్నారు. ఇద్దరు పిల్లల తర్వాత ట్యూబెక్టమి, వేసెక్టమి ఆపరేషన్ల ద్వారా పిల్లలు కలగకుండా చూసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి, ఆరోగ్య, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌లో అంతర పంటలకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు

మైదుకూరు : ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు అంతర పంటలు వేసుకునేందుకు ప్రోత్సాహం అందిస్తామని ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మైదుకూరు మండలం నంద్యాలంపేట వద్ద బీరం వెంకటసుబ్బారెడ్డి అనే రైతు సాగు చేసిన ఆయిల్ పామ్ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందుకుని ఆయిల్ పామ్‌లో రైతులు అంతర పంటలను సాగు చేయాలన్నారు. సాగు చేసే ప్రతి పంటను ఈ-పంటలో నమోదు చేయాలని ఉద్యాన సహాయకులకు సూచించారు. బిందు సేద్యంలో ఆటోమేషన్ గురించి రైతులతో చర్చించారు. ఆటోమేషన్‌ను రైతులు ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్ పామ్ జిల్లా ఉద్యాన అధికారి పి.రవిచంద్రబాబు, సూక్ష్మ నీటి పారుదల పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి, సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రతినిధి పీఎం కొండారెడ్డి, మైదుకూరు ఉద్యాన అధికారి సి.రామకృష్ణ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఐవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కలీముల్లా ఖాన్

ప్రొద్దుటూరు కల్చరల్ : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు కలీముల్లా ఖాన్ తెలిపారు. స్థానిక ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ కార్యాలయంలో శుక్రవారం సమావేశంలో పట్టణ నూతన అధ్యక్షుడుగా ఇస్మాయిల్ జబీవుల్లాను నియమించారు. ఈ సందర్భంగా కలీముల్లా ఖాన్ మాట్లాడుతూ ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ సమాజంలో చెడును నిర్మూలించడానికి పని చేస్తోందన్నారు. మద్యపానం, అశ్లీలత, చెడు వ్యసనాల నుంచి యువతను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐవైఎం ఉపాధ్యక్షుడు బేపారీ జబీవుల్లా, సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిశుభ్రత అందరి బాధ్యత



ప్లాస్టిక్ బాటిళ్లను సేకరిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

ప్రొద్దుటూరు : పర్యావరణ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పశువైద్య కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిశుభ్రతను మెరుగుపరచడం, మలినాలను తగ్గించడం పునఃప్రయోగానికి ప్రోత్సాహం ఇవ్వడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఇది శుద్ధమైన, హరిత భవిష్యత్తు దిశగా అడుగులు వేయడంలో ఒక ముఖ్యమైన ప్రయత్నమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇందిర, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలి



ఛలో ఢిల్లీ కరపత్రాలను విడుదల చేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

ప్రొద్దుటూరు : కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో ఈనెల 18న ఛలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను డీవైఎఫ్‌ఐ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమ, రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీలో ఏ ఒక్కటీ అమలు చేయాలని విమర్శించారు. కడప ఉక్కు పరిశ్రమ పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం స్వాగతించతగ్గ విషయమే అయినా ఉక్కు పరిశ్రమకు కేంద్రం నుంచి నిధులు రాబట్టాలన్నారు. రాష్ట్ర విభజన హామీలు, కడప ఉక్కు పరిశ్రమ కోసం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జరిగే ఛలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది



బి.మఠంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారులు

దువ్వూరు : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, వైద్య సిబ్బంది శుక్రవారం పీహెచ్‌సీ సెంటర్ నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సురేష్ బాబు, రోషిణి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జనాభా పెరుగుదలకు సంబంధించి ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఐక్యరాజ్య సమితి 1989 జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జూలై 11న జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజగోపాల్, సువర్ణ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బి.మఠం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వించారు. ఈర్యాలీలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మల్లేష్ మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ సంపత్‌కుమార్, సీహెచ్‌ఓ సాంబశివారెడ్డి, సూపర్వైజర్ పుష్పరాజ్, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు ల్యాబ్‌టెక్నీషియన్ తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ తల్లి కావడానికి సరైన వయస్సు, మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే వివాహం చేసుకోవాలని, బిడ్డ బిడ్డకు 3 సంవత్సరాలు దూరం ఉండాలని, వివాహ వయస్సు 18 సంవత్సరాలు దాటాలని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. విద్యార్థులు, వైద్య సిబ్బంది మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు బషీర్, ఎంఎల్‌హెచ్‌పీలు గౌతమి, రోహిణి, ప్రియదర్శిని, రాజేశ్వరి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ సమష్టి బాధ్యత

బద్వేలు అర్బన్ : దేశ ప్రగతికి ఆటంకంగా మారుతున్న జనాభా పెరుగుదలను అరికట్టి జనాభా నియంత్రణను ప్రతిఒక్కరు సమష్టి బాధ్యతగా తీసుకోవాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ జి.రాజేష్‌కుమార్, డాక్టర్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ, చింతలచెరువు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ఆవరణలలో వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన ఆహార కొరత, పేదరికం, నిరుద్యోగ సమస్యలు తలెత్తుతాయని అన్నారు. అలాగే బాల్య వివాహాలు అరికట్టాలని కోరారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శంభు ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్‌రావు, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.